క్లుప్తంగా

15న సినీ సంగీత విభావరి

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక బాపూజీ కళామందిర్‌లో ఈనెల 15వ తేదీన సాయంత్రం నాలుగు గంటల నుంచి శ్రీకాకుళం సంగీత నృత్య అకాడమీ ఆధ్వర్యంలో సినీ సంగీత విభావరి, వాయిద్య సంగీత విభావరి జరగనుంది. ఈ మేరకు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కళాతపస్వి కె.విశ్వనాథ్, పద్మవిభూషణ్ వాణి జయరాంలకు నివాళిగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

పంటల వివరాలు నమోదు చేయించుకోవాలి

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రతి రైతు రబీ సీజన్‌లో సాగు చేస్తున్న పంటలను విధిగా నమోదు చేయించుకోవాలని ఎచ్చెర్ల వ్యవసాయ అధికారి వై.సురేష్ అన్నారు. ఎచ్చెర్ల రైతు భరోసా కేంద్రంలో సోమవారం మాట్లాడుతూ.. ఈ నెల 15వ తేదీతో పంటల నమోదు, ఈకేవైసీ పూర్తి కానుందన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో బయోమెట్రిక్, మొబైల్ ఓటీపీ ద్వారా నమోదు జరుగుతుందన్నారు. ఆర్‌బీకేల ఇన్‌చార్జిలను రైతులు సంప్రదించాలని సూచించారు.

ఉమారుద్రునికి అభిషేకాలు

శ్రీకాకుళం కల్చరల్: గుడివీధిలోని నాగావళి నదీ తీరాన ఉన్న ఉమారుద్రకోటేశ్వర స్వామికి మాఘమాస సోమవారం సందర్భంగా విశేష పూజలు, అభిషేకాలు చేశారు. అర్చకులు ఆరవెల్లి శ్రీరామూర్తి, చంద్రశేఖరశర్మల ఆధ్వర్యంలో స్వామివారి మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, పూజలు, విశేష హారతులు ఇచ్చారు. మాఘమాసం సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

ప్రమాదాల నివారణపై దృష్టి



ఫ్లెక్సీని పెడుతున్న ట్రాఫిక్ పోలీసు

శ్రీకాకుళం క్రైమ్: రహదారి ప్రమాదాల నివారణపై పోలీసులు దృష్టి సారించారు. భద్రతా చర్యల్లో భాగంగా జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక ఆదేశాల మేరకు, ట్రాఫిక్ డీఎస్పీ ప్రసాదరావు ఆధ్వర్యంలో సోమవారం రాత్రి పట్టణంలోని పలు ప్రాంతాల్లో గోస్లో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఏడురోడ్ల కూడలి, ఖైరివానిపేట, బలగ, కృష్ణా పార్కు, పొట్టి శ్రీరాములు కూడళ్లలో ప్రమాదం జరుగు ప్రదేశం.. నెమ్మదిగా వెళ్లుము.. యాక్సిడెంట్ ప్రోన్ ఏరియా అంటూ ఫ్లెక్సీలు పెట్టారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రణస్థలం: పైడిభీమవరం 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్టు శ్రీకాకుళం ఈఈ ఎస్.భయ్యన్నాయుడు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. లైన్ల మరమ్మతులు చేపడుతున్నందున పైడిభీమవరం, వరిసాం, సరగడపేట, చిట్టివలస, ముక్కుపాలవలస, నారువ, అక్కయ్యపాలెం తదితర గ్రామాలకు సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

పద్మినికి డాక్టరేట్ ప్రదానం


పద్మినికి డాక్టరేట్ ప్రదానం చేస్తున్న వీసీ వెంకటరావు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం రూరల్ డెవలప్‌మెంట్ విభాగం నుంచి ఎస్‌టీపీ పద్మిని డాక్టరేట్ అందుకున్నారు. వర్సిటీ పరిపాలన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో వైస్ చాన్సలర్ నిమ్మ వెంకటరావు ఆమెకు పీహెచ్‌డీ ప్రదానం చేశారు. మహిళల ఆర్థిక స్వావలంబనలో స్వయం సహాయ సంఘాల పాత్ర అనే అంశంపై ఆమె పరిశోధన చేశారు. పూర్వపు ఇన్‌చార్జ్ వైస్ చాన్సలర్, దివంగత ప్రొఫెసర్ మిర్యాల చంద్రయ్య గైడ్‌గా వ్యవహరించగా.. సహాయ గైడ్‌గా ప్రిన్సిపాల్ బిడ్డిక అడ్డయ్య వ్యవహరించారు.

16న కారు వేలం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల పోలీస్‌స్టేషన్‌లో ఉన్న పాత మోడల్ ఆల్టో కారును ఈ నెల 16న వేలం వేయనున్నట్లు ఎస్సై వి.సత్యనారాయణ సోమవారం తెలిపారు. ఆసక్తి ఉన్న వారు వేలంలో పాల్గొనాలని సూచించారు. అన్ని ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామన్నారు.

15న ఏఐఆర్‌లో కొండలరావు ప్రసంగం

పొందూరు: అంతర్జాతీయ తెలుగు కథా రచయిత పాలగుమ్మి పద్మరాజు జీవితం, సాహిత్యం అనే అంశంపై స్థానిక సాహితీవేత్త వాండ్రంగి కొండలరావు ప్రసంగించనున్నారు. ఆకాశవాణి (ఏఐఆర్) విశాఖపట్నం కేంద్రంలో ఈ నెల 15న ఉదయం 7.15 గంటలకు ప్రసారం ఉంటుంది. ఈ మేరకు ఏఐఆర్ అధికారులు రచయితకు సోమవారం ధ్రువీకరణ పత్రాన్ని అందించారు.

శివరాత్రికి పక్కా ఏర్పాట్లు

- కోటేశ్వరస్వామి ఆలయ కమిటీ వెల్లడి

శ్రీకాకుళం కల్చరల్:


సమావేశంలో పాల్గొన్న కమిటీ సభ్యులు

శ్రీకాకుళం నగరంలోని ఉమారుద్రకోటేశ్వర స్వామి దేవాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలను భక్తులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా నిర్వహించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ట్రస్టు చైర్మన్ సుంకరి కృష్ణమోహన్, ఈవో రాధాకృష్ణ తెలిపారు. ఏర్పాట్లపై సోమవారం కమిటీ సభ్యులు సమావేశమయ్యారు. భక్తులు స్వామివారిని హాయిగా దర్శనం చేసుకునే విధంగా క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉచిత దర్శనం, రూ.20 ప్రత్యేక దర్శనాలు, రూ.50 శీఘ్రదర్శనాల క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. భకులు ఎండ బారిన పడకుండా షామియానాలు, క్యూలో ఉండే వారికి ఉచిత ప్రసాదాలు, వాటర్‌ప్యాకెట్లు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

నదీ స్నానాలకు ప్రత్యేక దారి

నాగావళి నదిలో స్నానాలు ఆచరించే భక్తుల కోసం రివర్‌వ్యూ పార్కు నుంచి వెళ్లేందుకు వీలుగా మున్సిపల్ అధికారుల సహకారంతో ప్రత్యేక దారిని ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. శివరాత్రి రోజున తెల్లవారుజామున మూడు గంటల నుంచి ఆలయ ప్రవేశం ఉంటుందన్నారు. ప్రత్యేక పూజల, రుద్రాభిషేకాలు భక్తుల రద్దీని బట్టి ఖాళీ సమయాల్లో చేయిస్తామన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం, అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసు బందోబస్తు, వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో మెడికల్ క్యాంపు నిర్వహిస్తామన్నారు. పరిసర ప్రాంతం పరిశుభ్రంగా ఉంచే విధంగా మున్సిపల్ అధికారుల సహకారం కోరినట్టు పేర్కొన్నారు. అత్యవసర టాయిలెట్లు ఏర్పాటు చేస్తామన్నారు.

ప్రత్యేక పూజలు

శివరాత్రి రోజున రాత్రి పది గంటలకు స్వామి వారికి రుత్వికులచే మహాన్యాస పూర్వక ఏకాదశవార మహారుద్రాభిషేకాలు, లక్ష బిల్వార్చన, అమ్మవారికి కుంకుమార్చనలు లింగోద్భవ సమయంలో ప్రత్యేక పూజలు ఉంటాయని ఆలయ అర్చకులు తెలిపారు. అలాగే మరుసరి రోజున తెల్లవారు జామున మూడు గంటలకు మహానందీశ్వర వాహనంపై తిరువీధి ఉత్సవం ఉంటుందని పేర్కొన్నారు. సమావేశంలో ట్రస్టు సభ్యులు, పోలీసు అధికారులు, ఆలయ ప్రధాన అర్చకులు ఆరవెల్లి శ్రీరామూర్తి ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు ఆధ్వర్యంలో జరజాం పంచాయతీ గొలివివానిపేట గ్రామంలో సోమవారం పొలంబడి నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది ప్రకృతి వ్యవసాయంపై పలు సూచనలు చేశారు. సాగు చేస్తున్న పంటపై పూర్తిస్థాయి అవగాహన ఉండాలన్నారు. పంటకు వ్యాపించే తెగుళ్లు, నివార చర్యలపై ప్రతేక దృష్టిపెట్టాలన్నారు. రబీలో వరి, అపరాలు, ఉద్యాన వన పంటల సాగుకు మెలుకవులు పాటిస్తే మంచి దిగుబడులు సాధ్యంగా వివరించారు. ప్రకృతి వ్యవసాయ సాగులో ఘన, ద్రవ జీవామృతాలు వినియోగం వల్ల భూసారం మెరుగ్గా ఉంటుందన్నారు. సిబ్బంది ధనుం జయ్, హరేరామ్, రామకృష్ణ పాల్గొన్నారు.


గొలివివానిపేటలో నిర్వహిస్తున్న పొలంబడి కార్యక్రమం

ఆశీల వసూళ్లకు వేలం రేపు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నగర కార్పొరేషన్ పరిధిలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి ఆశీలు వసూళ్ల కోసం ఏజెన్సీ ఎంపికకు ఈ నెల 15న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు కమిషనర్ ఓబులేసు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వేలంలో పాల్గొనేవారు రూ. 10 లక్షలు సాల్వెన్సీ, రూ.3 లక్షలు దరావత్తు చెల్లించాలని సూచించారు. బహిరంగ వేలంలో హెచ్చుపాట దారుడికి విలీన ఏడు పంచాయతీలతో సహా ఏడాదిపాటు ఆశీలు వసూలు చేసుకొనే హక్కు కల్పిస్తామన్నారు. ఆసక్తి ఉన్నవారు పూర్తి వివరాల కోసం కార్పొరేషన్ కార్యాలయంలోని రెవెన్యూ విభాగం సిబ్బందిని సంప్రదించాలన్నారు.

కత్తెర పురుగు నివారణపై అవగాహన అవసరం


వెంకటరావుపేటలో మొక్కజొన్న పంటలో మిత్ర పురుగులను విడిచిపెడుతున్న అధికారులు

రణస్థలం: మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు నివారణపై రైతులు అవగాహన కలిగి ఉండాలని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, జీవ నియంత్రణ విభాగం సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.విశాలాక్షి చెప్పారు. నెలివాడ, నగరప్పాలెం, ఉప్పివలస, వెంకటరావుపేట గ్రామాల్లోని మొక్కజొన్న పంటలను సోమవారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. మొక్కజొన్న విత్తిన వారం రోజుల నుంచి కత్తెర పురుగు నివారణకు ఒకే రకమైన పురుగు మందును పలుమార్లు పిచికారీ చేయడం వలన కత్తెర పురుగు ఆ రసాయనాలకు నిరోధక శక్తిని పెంచుకుంటుందని, దీని వలన భవిష్యత్‌లో నివారించడం కష్టసాధ్యమన్నారు. రైతులు జీవనియంత్రణ పద్ధతులపై అవగాహన పెంచుకున్నట్‌లైతే అతి తక్కువ ఖర్చుతో కత్తెర పురుగును సమర్థవంతంగా నివారించవచ్చనని సూచించారు. మొక్కజొన్న విత్తిన వారం రోజుల దశలో భారతీయ వ్యవసాయ పరిశోధన స్థానం(ఐకార్)కు చెందిన నేషనల్ బ్యూరో ఆఫ్ అగ్రికల్చర్ ఇన్ సెక్ట్ రీసోర్స్‌స్(ఎన్‌బిఏఐఆర్)– బెంగళూరు వారు రూపొందించిన బహుళ పురుగు మందులను తట్టుకునే మిత్ర పురుగు (మల్టిపుల్ ఇన్‌స్కెక్టిసైడ్ టోలరెంట్ స్ట్రైన్ – ఎం.ఐ.టి.యస్) గుడ్లను ఎకరాకు 20 వేల చొప్పున వారం వ్యవధిలో రెండు సార్లు విడుదల చేయాలన్నారు. ఆ గుడ్ల నుంచి పిల్ల పురుగులు బయటకు వచ్చి కత్తెర పురుగును గుడ్డు దశలోనే నిర్వీర్యం చేస్తాయన్నారు. దీని వలన పంట 20 రోజుల దాటే వరకు రసాయన పురుగుమందుల అవసరం లేదన్నారు. అప్పటికి కత్తెర పురుగు ఉన్నట్లు గుర్తించినట్లైతే ఒక కిలో మెటారైజియం జీవ నియంత్రణ శిలీంద్ర మందును ఎకరాకు 200 లీటర్ల నీటిలో కలిపి మొక్క మొవ్వులో పడేటట్లు పిచికారీ చేయాలన్నారు. ఒక వేల రసాయనిక పురుగుమందులు పిచికారీ చేసినా ఈ మిత్ర పురుగు తట్టుకుని పొలంలో బతకగలిగే సామర్థ్యం ఉండి తన పని తీరును సమర్థవంతంగా నిర్వహించగలదన్నారు. అనంతరం నెలివాడ, ఉప్పివలస, వెంకటరావుపేట గ్రామాల్లోని వారం రోజుల దశలో ఉన్న ఐదు ఎకరాల మొక్కజొన్న పంటల్లో కత్తెర పురుగు రెక్కల పురుగుల ఉధృతిని నివారించడానికి లింగాకర్షక బుట్టలను, మిత్రపురుగులను మొక్కజొన్న మొక్క ఆకులపై ఎలా విడుదల చేయాలో రైతుల సమక్షంలో ప్రత్యక్ష్యంగా చూపించి విడుదల చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ప్రాంతీయ మేనేజర్ ఆర్.హరిబాబు, సమన్వయకర్తలు, పి.తవిటినాయుడు, యస్.పి నారాయణ రావు, పి.రమణ, కె.మనోజ్ ఉన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

లావేరు: అప్పాపురం గ్రామ జంక్షన్ వద్ద ఉన్న ఆంజనేయస్వామి ఆలయ 11వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి తమలపాకులు, నిమ్మకాయలు, పసుపు, కుంకుమలతో ప్రత్యేక పూజలు జరిగాయి. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ లుకలాపు అప్పలనాయుడు, సోషల్ మీడియా మండల కన్వీనర్ రెడ్డి రమణ, మాజీ సర్పంచ్‌లు శివాంగం నాగరాజు, గొర్లె రామినాయుడు, పార్టీ నాయకులు జగ్గరోతు సత్యన్నారాయణ, యడ్ల మోహన్, మీసాల నారాయణరావు, పతివాడ గురునాయుడు, రెడ్డి రామారావు, అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు. ఆలయం వద్ద మధ్యాహ్నం అన్నదానం చేశారు.


స్వామి వారికి పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అక్రమ పట్టాలపై విచారణ చేపట్టాలి

కొత్తూరు: మండలంలోని మెట్టూరు బిట్–1 పునరావాస కాలనీలో అక్రమంగా పట్టాలు పొందిన వారిపై చేపట్టిన విచారణ పారదర్శకంగా లేదని వైఎస్సార్‌సీపీ నాయకులు బూర్లె శ్రీనివాసరావు, గొంటి రమేష్ అన్నారు. సోమవారం రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో తహసీల్దార్ పి.బాలకు దీనిపై వినతిపత్రం అందజేశారు. రౌతు సూర్యనారాయణ, అనంతరావు, బోర ఢిల్లేశ్వరరావుతోపాటు పలువురిపై విచారణ పూర్తిస్థాయిలో చేపట్టలేదన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. మెట్టూరు బిట్–1 కాలనీ, కుంటిభద్ర, ఐరపాడుగూడతోపాటు మరో రెండు గ్రామలు నుంచి ఐదు వినతలు అందినట్లు తహసీల్దార్ చెప్పారు.

బాలలను పనిలో పెడితే కఠిన చర్యలు

మెళియాపుట్టి: కొన్ని నెలలకు బాండ్ రాయించుకుని బాలలతో పనులు చేయిస్తున్నారన్న సమాచారంతో శ్రీకాకుళం పోలీసులు సోమవారం చాపరలోని రామకృష్ణ, శిరామకృష్ణ జీడి పరిశ్రమలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లలను పాఠశాలలకు పంపించకుండా పనులు చేయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మానవ అక్రమరవాణాలో భాగంగా ఈ నెల 9 నుంచి 15వ తేదీ వరకు అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నట్లు జాతీయ బాలికల సంరక్షణా విభాగానికి చెందిన అధికారి బాలకృష్ణ, మెళియాపుట్టి తహసీల్దార్ సరోజిని అన్నారు. వీరు జీడి పరిశ్రమలలో పనిచేస్తున్న మహిళలకు అవగాహన కల్పించారు. ఎస్ఐ లక్ష్మణరావు, ఏఎస్ఐ రమణ మూర్తి, మెళియాపుట్టి ఎస్ఐ అప్పన్న పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ అభియోగాలపై వివరాల సేకరణ

- నివేదిక డ్వామా పీడీకి అందజేస్తాం
- జిల్లా విజిలెన్స్ అధికారి బి.లవరాజు


వివరాలు సేకరిస్తున్న జిల్లా విజిలెన్స్ అధికారి లవరాజు

మెళియాపుట్టి: మండలంలో ఇటీవల నిర్వహించిన 13, 14, 15వ విడతల ఉపాధి హామీ సామాజిక తనిఖీల్లో గుర్తించిన పలు అంశాలపై శ్రీకాకుళం జిల్లా విజిలెన్స్ అధికారి బి.లవరాజు వివరాలు సేకరించారు. సోమవారం ఆయన మండల కేంద్రంలోని ఉపాధి కార్యాలయంలో పలు అభియోగాలకు సంబంధించి సిబ్బంది వద్ద ఆధారాలు తీసుకున్నారు. సామాజిక తనిఖీ బృందాలు గుర్తించిన అంశాల్లో.. చనిపోయిన మొక్కల స్థానంలో మరలా మొక్కలు నాటినట్లు (రీప్లేస్‌మెంట్) గుర్తించారు. అదేవిధంగా పనులు చేసిన స్థలాల్లో వివరాలు తెలిపే సూచికలను పెట్టలేదనే విషయాన్ని అప్పటికి తనిఖీ చేసినవారు గుర్తించారు. వాటికి సంబంధించిన ఎఫ్‌టీఓలు ఆలస్యంగా రావడంలో ఇటీవల అన్ని పనుల వద్ద సూచికలు ఏర్పాటు చేశామని దానికి సంబంధించిన ఫొటోలు, వివరాలు సిబ్బంది అందజేశారు. అనంతరం విజిలెన్స్ అధికారి లవరాజు మాట్లాడుతూ.. సిబ్బంది వద్ద సేకరించిన వివరాలను జిల్లా నీటియాజమాన్య సంస్థ పథకసంచాలకులు జి.వి.చిట్టిరాజుకు సమర్పించనున్నట్లు తెలియజేశారు. అదేవిధంగా పనులు, కొలతల్లో తేడాలు, విధి నిర్వహణలో అలసత్వం వహించిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి సురేష్, హెచ్.ఆర్ మేనేజర్ శ్రావణ్ కుమార్, మెళియాపుట్టి ఎంపీడీఓ పడాల చంద్రకుమారి, ఏపీడీ తెంబూరు రవి, ఏపీఓ సురేష్, ఈసీ ఆదినారాయణ రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

గ్రంథాలయంలో మహిళా దినోత్సవం


ఎచ్చెర్ల: సరోజినీ నాయుడు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల: ధర్మవరం శాఖా గ్రంథాలయంలో జాతీయ మహిళా దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. తొలుత సరోజినీనాయుడు చిత్రపటానికి గ్రంథాలయ అధికారి మలిపెద్ది చంద్రశేఖర రావు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓర్పు, ఓదార్పునకు మారుపేరుగా నిలిచి అనురాగాన్ని ఆత్మీయతను పంచేది మహిళలేనన్నారు. సరోజినీ నాయుడు భారత కోకిలగా ప్రసిద్ధి చెందిన స్వాతంత్ర్య సమరయోధులన్నారు. మహిళల్లో చైతన్యం రావడానికి ఎంతో దోహదపడ్డారన్నారు. అనంతరం విద్యార్థులకు వకృత్వ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు బి.సూర్యనారాయణ, పాఠకులు పాల్గొన్నారు.


లావేరు: సరోజినీనాయుడు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

సరోజినీనాయుడును ఆదర్శంగా తీసుకోవాలి

లావేరు: భారత కోకిల సరోజినీనాయుడును ఆదర్శంగా తీసుకోవాలని మురపాక శాఖాగ్రంథాలయాధికారి ఎం.శ్రీనివాసరావు అన్నారు. గ్రంథాలయంలో జాతీయ మహిళా దినోత్సవం, సరోజినీనాయుడు జయంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సరోజినీనాయుడు స్వాతంత్ర్య భారతదేశ తొలి మహిళా గవర్నర్‌గా పనిచేశారన్నారు. కవిగా, రచయితగా, సమాజ సేవకురాలుగా పనిచేసి మంచి పేరు తెచ్చుకున్నారని గుర్తు చేశారు. గ్రంథాలయ సహాయకుడు పి.షణ్ముఖరావు, విద్యార్థులు పాల్గొన్నారు.


సరోజినీనాయుడు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కళాశాల ప్రతినిధులు

మహిళాభివృద్ధికి విశేష కృషి

శ్రీకాకుళం న్యూకాలనీ: మహిళాభివృద్ధి కోసం నైటింగేల్ ఆఫ్ ఇండియా సరోజినీనాయుడు విశేషమైన కృషి చేశారని కాకినాడ ఆదిత్య డిగ్రీ కళాశాలల ఉత్తరాంధ్ర డైరెక్టర్ పి.రామకృష్ణారెడ్డి కొనియాడారు. శ్రీకాకుళం జిల్లా డైరెక్టర్ బీఎస్ చక్రవర్తితో కలిసి నగరంలోని ఎల్ఐసీ కార్యాలయం సమీపంలో ఉన్న ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో సరోజినీ నాయుడు జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా నాయుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్యం కోసం పోరాటం చేయడంతోపాటు మొట్టమొదటి మహిళా గవర్నర్‌గా కీర్తిగడించిన సరోజినీనాయుడు జీవిత విశేషాలను నేటి యువత ఆదర్శంగా తీసుకుని ఉన్నతస్థాయికి చేరుకోవాలని వారు ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ కె.శివశంకర్, మజ్జి శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ వెంకటఅప్పారావు, మహిళా ఉపాధ్యాయులు మాధవి, మౌనిక, వనజాక్షి, లైబ్రేరియన్ కమల్ కుమార్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే శ్రీరామ రక్ష

జి.సిగడాం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే వైఎస్సార్‌సీపీకి శ్రీరామ రక్ష అని వైస్ ఎంపీపీ మీసాల సాద్వీమణి అన్నారు. నిద్దాం గ్రామంలో సోమవారం కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు లేనిపోని ప్రచారాలు చేస్తున్నారని.. వాటిని తిప్పికొట్టాలన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యులు కాయల రమణ, పీఏసీఎస్ చైర్మన్ ఏర్నేన ప్రకాశరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు బూరాడ వెంకటరమణ, పేడాడ శ్రీరామమూర్తి, మీసాల రాంబాబు, సర్పంచులు సాకేటి నాగరాజు, చిత్తిరి మోహన్ ఉన్నారు.


మాట్లాడుతున్న సాద్వీమణి

ఆదిత్యుని సన్నిధిలో ఓసీ సంక్షేమ సంఘ బృందం

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారిని ఓసీ సంక్షేమ సంఘ జాతీయ అధ్యక్షుడు జి.కరుణాకరరెడ్డి నేతృత్వంలోని బృందం సోమవారం దర్శించుకుంది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లు కల్పించడం చారిత్రాత్మకమన్నారు. అంతకుముందు ఆదిత్యున్ని అంతరాలయం నుంచి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈయన వెంట సంఘ జిల్లా అధ్యక్షుడు ద్వారపు అజిత్‌కుమార్, నేతలు పిల్లా వెంకటరమణ, నిమ్మకాయల శ్రీధర్, జామి చిన్నికృష్ణ ఉన్నారు.


ఆదిత్యుడ్ని దర్శించుకుంటున్న కరుణాకర్‌రెడ్డి తదితరులు

కరాటే పోటీల్లో సిక్కోలు విద్యార్థుల ప్రతిభ


పతకాలు సాధించిన విద్యార్థులతో కోచ్ లక్ష్మణరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: అంతర్జాతీయ కరాటే పోటీల్లో శ్రీకాకుళం నగరానికి చెందిన పలువురు విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో అల్ స్టైల్స్ కుంగ్ఫూ చాంపియన్ షిప్ పోటీల్లో శ్రీకాకుళం నగరానికి చెందిన ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు పలు పతకాలు సాధించారు. బాంగ్లాదేశ్, నేపాల్, మలేషియా, ఇండియాకు చెందిన క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీల్లో 15 పతకాలతో ఆ స్కూల్ విద్యార్థులు మెరిశారు. అండర్–12, అండర్–14 వయో విభాగాల్లో వివిధ కేటగిరీల్లో ఐదు బంగారు, ఐదు రజత, ఐదు కాంస్య పతకాలు ఉన్నాయి. పతకాలు సాధించిన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ ముద్దాడ సత్యప్రసాద్, ప్రిన్సిపాల్ ఉషాకిరణ్మయి అభినందించారు.

లెప్రసీపై అప్రమత్తం

నరసన్నపేట: లెప్రసీపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జనవరి 30 నుంచి నిర్వహిస్తున్న స్పర్శ పక్షోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా సత్యవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు లెప్రసీపై అవగాహన కల్పించారు. దీంట్లో పాల్గొన్న డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ వాన సురేష్ మాట్లాడుతూ విద్యా సంస్థల్లో లెప్రసీపై అవగాహన కలిగించామన్నారు. ప్రతి ఒక్కరూ లెప్రసీపై అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించడం జరిగిందన్నారు. హెచ్ఎంకృష్ణంరాజు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ దైవ కటాక్షం, హెల్త్ సూపర్‌వైజర్ రమణమూర్తి, కృష్ణారావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వాన సురేష్

భగవద్గీతతో సమస్యలకు పరిష్కారం

సరుబుజ్జిలి: భగవద్గీత పవిత్రతను కాపాడి, హిందూధర్మ పరిరక్షణకు అందరూ కలిసికట్టుగా సాగాలని హిందూ జ్ఞాన ప్రచారవేదిక శ్రీకాకుళం కమిటీ అధ్యక్షుడు సంతోష్‌కుమార్ తెలిపారు. మండలంలోని పురుషోత్తపురం గ్రామంలో సోమవారం భగవద్గీత ఆవశ్యకతపై కరపత్రాలు పంపిణీ చేసి ధర్మప్రచారం నిర్వహించారు. భగవద్గీతలో ప్రతి సమస్యకూ పరిష్కారం లభిస్తుందన్నారు. జ్ఞాన వేదిక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.